సాక్షి
మహబూబాబాద్
శనివారం । 28 । జూన్ । 2025



దత్తత గ్రామంలో సంబురాలు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండవర్తిలో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. - 8లో▸



ప్రజల గుండెల్లోనే పీవీ..

చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. నేడు పీవీ 104వ జయంతి సందర్భంగా కథనం. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.3⁰ /24.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బెస్ట్ అవైలబుల్ స్కీం ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు 2025–26 విద్యా సంవత్సరానికి గిరిజన విద్యార్థుల బెస్ట్ అవైలబుల్ స్కీం ఎంపికలు లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన శాఖ అధికారి గుగులోతు దేశీరాం నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీంకు దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

‘పది’ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయని డీఈఓ రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 54 మంది ఉత్తీర్ణులయ్యారని, 94.74శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు చెప్పారు. రికౌంటింగ్ పెట్టాలనుకునే విద్యార్థులు ఎస్‌బీఐ బ్యాంకులో రూ.500 చలాన్ చెల్లించి, ప్రధానోపాధ్యాయుడి సంతకంతో జూలై 7వ తేదీలోపు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ హైదరాబాద్‌కు పంపించాలన్నారు. అలాగే రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చలాన్ చెల్లించి విద్యాశాఖ కార్యాలయంలోని ఎగ్జామినేషన్ సెక్షన్‌లో జూలై 7లోపు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు 98497 61012 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా విజయేందర్‌రెడ్డి



నెహ్రూసెంటర్/తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పి.విజయేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా శ్రీనివాసాచారి కొద్దిరోజులు బాధ్యతలు చేపట్టగా.. పూర్తిస్థాయి ఎస్ఈగా పి.విజయేందర్‌రెడ్డి జిల్లాకు వచ్చారు. మహబూబాబాద్ జిల్లా నుంచి డివిజన్ ఇంజనీర్ టెక్నికల్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్ది రాజం వరంగల్‌కు, తొర్రూరు డీఈ మధుసూదన్ మెట్‌పల్లికి బదిలీ అయ్యారు. కాగా పెద్దపల్లి డీఈ రవి తొర్రూరు డీఈగా బదిలీపై రానున్నారు. కాగా మహబూబాబాద్ డీఈటీ, తొర్రూరు డీఈ బాధ్యతలను ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకన్ననాయక్



నెహ్రూసెంటర్: సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన వెంకన్ననాయక్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఎన్నుకున్నారని, సంఘం బలోపేతం, గిరిజనుల హక్కుల సాధనకు పోరాటాలు నిర్వహిస్తానని వెంకన్ననాయక్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఎంజీఎం: వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు చేయాలనే ఒప్పందం, నష్టపోయిన అర్హులైన 400 మెడికల్ విద్యార్థులకు న్యాయం జరగాలని, అవినీతి అధికారులపై విచారణ చేపట్టాలని కోరుతూ వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు తప్పనిసరి. అయితే తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకున్నా.. 400 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రెండు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడం, ఈక్రమంలో గతేడాది అర్హులైన 400 మెడికల్ సీట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి దాటిపోవడంపై జరిగిన అవినీతిపై విచారణ కోసం లోకాయుక్తలో ఫిర్యాదు దాఖలు చేసినట్లు వినియోగదారుల మండలి ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు.

భూ సమస్యలకు మోక్షం!

- ఆన్‌లైన్‌లో భూ భారతి దరఖాస్తుల వివరాలు నమోదు
- రెవెన్యూ సదస్సుల్లో 39,513 అర్జీల స్వీకరణ
- ముందుగా నోటీసులు జారీ
- తర్వాత విచారణ, అవసరమైతే భూ సర్వే ద్వారా పరిష్కారం



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టం తీసుకొచ్చి రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేస్తోంది. తర్వాత నోటీసులు ఇవ్వడం, విచారణ మొదలైన ప్రక్రియలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. త్వరగా తమ భూ సమస్యలు పరిష్కరించి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

దరఖాస్తుల వరద..

జిల్లాలో ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా అధికారులు పైలెట్ మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇది సక్సెస్ కావడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో జూన్ 3నుంచి 16వ తేదీ వరకు సదస్సులు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన సమస్యల జాబితాతో కూడిన దరఖాస్తు ఫాం తయారు చేసి గ్రామాల్లో పంపిణీ చేశారు. సర్వే నంబర్ మిస్ కావడం, మ్యుటేషన్ పెండింగ్, డీఎస్ పెండింగ్, భూ స్వభావంలో మార్పు, పట్టేదారు వివరాల సవరణ, ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడం, అసైన్డ్ ల్యాండ్, ఓఆర్‌సీ, వారసత్వం, భూ సేకరణ మొదలైన అంశాలపై దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 39,513 దరఖాస్తులు రాగా.. అధికంగా 2007 వారసత్వ సమస్యలు ఉండగా.. అత్యల్పంగా 38–ఈ సర్టిఫికెట్ సమస్యలు ఉన్నాయి.

మొదలైన కసరత్తు

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ జిల్లాలో మొదలైంది. 18 మండలాల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ముందుగా ప్రతీ దరఖాస్తుదారుడికి, సమస్యకు కారణమైన వారికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఆ తర్వాత విచారణ చేసి అక్కడే గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరిస్తారు. అయితే అత్యధికంగా భూ సర్వేతో ముడిపడి ఉన్న సమస్యలు ఉండడంతో 183 మంది సర్వేయర్లను నియమించి 50రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. సర్వే ద్వారా ఆ భూ సమస్యలను పరిష్కరిస్తారు.

ప్రక్రియ వేగవంతం



భూ భారతి చట్టం అమలు ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. రెండు మూడు రోజుల్లో నోటీసులు జారీ చేసి, ప్రతీ అంశాన్ని విచారణ చేస్తాం. ఈ విచారణలో రైతుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది. భూ భారతి చట్టం ద్వారా నిజమైన భూ యజమానికి మేలు జరుగుతుంది.

-వీరబ్రహ్మచారి, అదనపు కలెక్టర్(రెవెన్యూ)

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల వివరాలు

సమస్య	వచ్చిన దరఖాస్తులు
సర్వే నంబర్ మిస్సింగ్	1,476
పెండింగ్ మ్యుటేషన్	384
డీఎస్ పెండింగ్	1,148
విస్తీర్ణం సవరణ	1,632
భూ స్వభావంపై	263
పట్టేదారు పేర్ల సవరణ	225
ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తీసివేయడం	462
ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడం	02
అసైన్డ్ భూ సమస్య	1,378
ఓఆర్‌సీ ఇష్యూ కానివి	45
38–ఈ సర్టిఫికెట్ రాకపోవడం	06
వారసత్వ సమస్య	2,007
భూ సేకరణ సమస్య	169
ఇతర సమస్యలు	30,316
మొత్తం దరఖాస్తులు	39,513

ట్రాఫిక్ కష్టాలు..

- మానుకోటలోని మోడల్‌మార్కెట్ ఎదుట పార్కింగ్ అడ్డా ఏర్పాటు
- వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు



పాత తొర్రూరు బస్టాండ్ రోడ్డులో పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు, తోపుడుబండ్లు

మహబూబాబాద్: జిల్లా కేంద్రం కొత్తబజారు మోడల్ మార్కెట్ ఎదుట ఉన్న రోడ్డు (పాత తొర్రూరు బస్టాండ్ సెంటర్)లో ఏర్పాటు చేసిన పార్కింగ్ అడ్డాతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అక్కడ ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో ఆ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కాగా వాహనాల పార్కింగ్‌తో పాటు ఆరోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది.

ఇటీవల నెహ్రూసెంటర్‌లో తొలగింపు..

ఇటీవల నెహ్రూసెంటర్‌లో ఉన్న పార్కింగ్ అడ్డాను పోలీసులు తొలగించారు. ఆ ప్రాంతంలో మార్క్ చేసి, వాహనాలను పార్కింగ్ చేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో ఆప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీరింది. ఆరోడ్డు గుండా రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం పార్కింగ్ తొలగించడంతో వాహనదారులు సాఫీగా వెళ్తున్నారు. కాగా పాత తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పార్కింగ్ అడ్డాను తొలగించి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కొంగల కోలాహలం..

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు కురవి రోడ్డులోని బంధం చెరువులో శుక్రవారం ఉదయం కొంగలు సందడి చేశాయి. వందల సంఖ్యలో కొంగలు వాలగా.. ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లబ్ధిదారుకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 72 మంది లబ్ధిదారులకు రూ.72.8 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద బిడ్డల వివాహాలకు ప్రభుత్వం సాయం అందించి అండగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేనివి కాంగ్రెస్ ప్రభుత్వం 18 మాసాల్లో చేసి చూపుతుందన్నారు. పేదలకు అండగా రేవంత్‌రెడ్డి సర్కారు నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, స్థానిక నాయకులు గంజి విజయ్‌పాల్‌రెడ్డి, ముద్దం విక్రమ్‌రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, వెన్నం సోమిరెడ్డి, మిత్తింటి హరీశ్, మొగుళ్ల లింగన్న, మహబూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసే పనులను ప్రజలకు తెలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం చేసే మంచి పనులను గ్రామాల్లోని ప్రజలకు తెలపాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, పార్టీ కోసం కష్టపడిన నాయకులను సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా గెలిపించుకోవాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితం అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, చాపల బాపురెడ్డి, పెదగాని సోమయ్య, జాటోతు నెహ్రూ, ఎర్రబెల్లి రాఘవరావు, జలకం శ్రీనివాస్, పింగిళి ఉష, వల్లపు యాకయ్య, అలువాల సోమయ్య, దొంగరి శంకర్, జాటోతు రవి, బచ్చలి లక్ష్మణ్, వల్లపు మల్లయ్య పాల్గొన్నారు.

తడి, పొడి పద్ధతుల్లో విత్తన శుద్ధి చేసుకోవాలి



వరి నారును పరిశీలిస్తున్న అధికారులు

గూడూరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా వరిలో తడి లేదా పొడి పద్ధతుల్లో విత్తనశుద్ధి చేసుకోవాలని ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. గూడూరు, గాజులగట్టు గ్రామాల్లో శుక్రవారం వరి, పత్తి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో తడి పద్ధతిలో లీటరు నీటికి 3గ్రాముల కార్బండిజమ్ కలిపిన నీటిలో కిలో విత్తనాలను 12 నుంచి 24 గంటల పాటు నానబెట్టిన తర్వాత విత్తుకోవాలని సూచించారు. పొడి పద్ధతిలో కిలో విత్తనాలకు 1గ్రాము కార్బండిజమ్ కలిపి నేరుగా నారుమడిలో చల్లుకోవచ్చని తెలిపారు. వానాకాలం మొక్కజొన్న పంటను బోదె సాళ్ల పద్ధతిలో వేసుకోవాలని, దీంతో అధిక వర్షాలు కురిస్తే పంట ముంపునకు గురికాకుండా ఉంటుందన్నారు. యూరియాను మోతాదుకు మించి వినియోగించొద్దన్నారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ మాలిక్, ఏఈఓ మధు, రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: రానున్న మున్సిపాలిటీ, సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని, అధిక స్థానాలను కైవసం చేసుకోవాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సమావేశం జిల్లా కేంద్రంలోని ధర్మన్న కాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐని స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, శ్రావణ్, తోట రాజకుమారి, మంద శంకర్, మాలోత్ రవీందర్, ఆబోతు అశోక్, మంచినీళ్ల రాకేశ్, తండ శ్రీనాథ్, మాధవి, అలీమా తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. మంజూరు, గ్రౌండింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, హౌసింగ్ డీఈ రాజయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి..

ప్రతీ గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025లో జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

పటిష్ట చర్యలు తీసుకోవాలి..

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని లెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ సమావేశ మందిరంలో రోడ్డు ప్రమాదాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, డీఎస్పీ తిరుపతి రావు, ఆర్అండ్‌బీ ఈఈ బీమ్లా పాల్గొన్నారు.

టెంట్‌సిటీ చోరీ కేసులో జాప్యం

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు సరస్వతీనది పుష్కరాలు ఘనంగా జరిగాయి. వీవీఐపీలు, భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన ఆలీ ఎలిమెంట్ అనే ప్రైవేట్ సంస్థ 40వరకు టెంట్ సిటీలను తాత్కాలికంగా ఏర్పాటు చేసింది. అందులో ఏసీలు, బెడ్స్, ఫర్నిచర్, కూలర్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసింది. 12రోజుల పాటు అత్యంత ఆకర్షణగా నిలిచింది. మే 26న పుష్కరాలు ముగియడంతో రెండు రోజుల తర్వాత టెంట్‌సిటీలో దొంగలు ఎనిమిది ఏసీ కంప్రెషర్లు, కూలర్లు, ఇతర ఫర్నిచర్లు దొంగిలించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టెంట్‌సిటీలో దొంగిలించిన సామగ్రిని రికవరీ చేయడంతో పాటు దొంగలను గుర్తించడంతో పోలీసులు శ్రద్ధ చూపడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే గతంలో కాళేశ్వరంలో పలువురి దుకాణాలు, ఇళ్లలో చోరీ జరిగి సంవత్సరాలు గడిచినా ఛేదించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం పుష్కరాలు ముగిసి నెల రోజులు అవుతున్నా కేసులో పురోగతి సాధించకపోవడంతో గ్రామంలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే గ్రామంలో పలువురు అనుమానితుల వివరాలను పోలీసులు సేకరించి, విచారణ జరుపుతున్నారని తెలిసింది. కాళేశ్వరంతో పాటు మహదేవపూర్, కాటారం, భూపాలపల్లికి చెందిన వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై తమాషారెడ్డిని సంప్రదించగా.. టవర్ డంప్ చేశామని, సీడీఆర్ ఇచ్చామని, సీసీఎస్ పోలీసులు తేల్చాల్సి ఉందని తెలిపారు.

హేమాచల క్షేత్రంలో ఎంపీ పూజలు

మంగపేట: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని మానుకోట ఎంపీ బలరాం నాయక్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.ఎంపీ వెంట కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, రాజేందర్, సోమయ్య ఉన్నారు.

కపాలినీ, భగమాలినీ క్రమాల్లో భద్రకాళి



కపాలినీ అలంకరణలో అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి కపాలినీ, భగమాలినీ క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఉదయం 4 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, చతుఃస్థానార్చన తదితర పూజలు నిర్వహించారు. దశ మహావిద్యల్లోని కాళీక్రమాన్ని అనుసరించి స్నపనబేరాన్ని కపాలినీగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగబేరాన్ని భగమాలినీగా అలంకరించి నవరాత్ర విశేష పూజలు జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు జరుపుకున్నారు. సినీ నటులు కొణిదెల నాగబాబు సతీమణి పద్మజ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల్లో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ





లీకేజీతో వృథాగాపోతున్న తాగునీరు, బురదమయంగా మారిన ట్యాంకు పిల్లర్ల ప్రాంతం

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వేమునూరు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో ప్రతీరోజు తాగునీరు వృథాగా పోతోంది. చాలారోజుల నుంచి పైపులైన్ లీకేజీ అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఈక్రమంలో ట్యాంకు పిల్లర్ల ప్రాంతంలో నీళ్లు నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడే మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండడంతో విద్యార్థులు అటువైపుగా వెళ్లి లీకేజీ నీళ్లలో జారిపడిన ఘటనలు ఉన్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. లీకేజీ కారణంగా ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి అధ్వానంగా కనిపిస్తోంది. కాగా, మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆషాఢం వేడుకల వేళ..

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు
- అమ్మవార్లకు మొక్కుల చెల్లింపులకు సిద్ధం
- తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు ప్రత్యేకం
- గురువారం ప్రారంభమైన మాసం





హన్మకొండ కల్చరల్: ఆషాఢం వేడుకలకు సమయం ఆసన్నమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలకరి వానలు పలకరించాయి. ఫలితంగా పంటల సాగుతో పాటే గ్రామ దేవతల (బోనాలు)కు పూజలు మొదలు కానున్నాయి. ఆషాఢ మాసం గురువారం ప్రారంభమైంది. ఇదే సమయంలో గ్రామాల్లో అమ్మవారిని కొలిచేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. మహిళలు కలిసికట్టుగా బయలుదేరి మొక్కులు చెల్లించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో ప్రతీరోజు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కొందరికి గ్రామదేవతలకు బోనాలు సమర్పించే సంప్రదాయం కూడా ఉంది. ఇలవేల్పులైన అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు.

ఆలయాల్లో ఉత్సవాలు..

ఆషాఢ మాస శుద్ధ ఏకాదశి రోజున విష్ణువు యోగానిద్రలోకి వెళ్లిన రోజుగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదే సమయంలో పూరి జగన్నాథ రథయాత్ర, గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా వేడుకగా జరుపుకోనున్నారు. అలాగే, వరంగల్ జిల్లాలో శ్రీభద్రకాళి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం.

గోరంటాకు మురిపెం.. ఆరోగ్యదాయకం

వర్షకాలం ప్రారంభమై బావులు, వాగులు, చెరువుల్లోకి కొత్త నీరొస్తుంది. ఇది చర్మవ్యాధులు వ్యాప్తి చెందే కాలం. వీటి బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు గోరింటాకు ఔషధంగా పని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకును (మెహందీ) అలంకరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఆయుర్వేద వైద్య నిపుణులు గోరింటాకు చర్మ వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుందని, శరీరంలో వేడి తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం.. ఆనందం

హిందూ సనాతన ధర్మంలో ఆరోగ్యం, ఆనందం కోసం కొన్ని పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. ఇందులో కుంకుమ, తిలకం అద్దుకోవడం, విభూదిధారణ, గంధ ధారణ, కాటుక, గోరింటాకు పెట్టుకోవడం లాంటి పద్ధతులు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, అలాగే శరీరం కళకళలాడుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.



వనభోజనాల సందడి..

ఆషాఢ మాసంలో వనభోజనాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. ప్రధానంగా గ్రామాల్లోని వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు వెల్లివిరియాలని కోరుకుంటారు. గ్రామదేవతలకు పూజలు నిర్వహించి ప్రకృతి ఒడిలో పచ్చని పంట పొలాల మధ్య చెట్ల కింద సామూహిక వనభోజన సంబురాలు జరుపుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

గోరింటాకు వేడుకలు


గోరింటాకు చూపుతున్న మహిళలు

హసన్‌పర్తి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని 55వ డివిజన్ సత్యసాయి కాలనీలో అతివలు అరచేతిలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో తుమ్మ వనమాల, ఎర్రబెల్లి సుజాత, చెరుకు కృష్ణవేణి, చిట్టిరెడ్డి మంగ పూల్లారి సరోజన, లావణ్య, చింత జ్యోతి, తుమ్మ ప్రియాంక, తుమ్మ పద్మ నిహాసి పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు, సర్దుబాట్లు జరిగాయి. ఈ మేరకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ సీజీఎం వంటేరు తిరుపతి రెడ్డి డైరెక్టర్‌గా నియామకం కావడంతో ఖాళీ అయిన స్థానంలో సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా కొనసాగుతున్న ఆర్.చరణ్‌దాస్‌ను పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో నియమించారు. సిరిసిల్ల సెస్‌కు ఫారిన్ డిప్యుటేషన్‌పై వెళ్లిన పి.విజేందర్ రెడ్డి అక్కడి నుంచి సెలవుపై వెళ్లి తిరిగి ఎన్పీడీసీఎల్‌లో విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఆయనను మహబూబాబాద్ ఎస్‌ఈగా నియమించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శన్‌ను నిర్మల్ నుంచి జగిత్యాలకు బదిలీ చేశారు. ఎస్‌ఈ వి.గంగాధర్‌ను మంచిర్యాల నుంచి పెద్దపల్లికి, జీఎం వి.వేణుమాధవ్‌ను కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు నుంచి జీఎం ప్లానింగ్‌కు బదిలీ చేశారు. కార్పొరేట్ ఆఫీస్‌లో ఆపరేషన్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న ఉత్తమ్.. మంచిర్యాల ఎస్‌ఈగా, జగిత్యాల ఎస్‌ఈ సాలియా నిర్మల్ ఎస్‌ఈగా బదిలీ అయ్యారు. తొర్రూరు డీఈ జి.మదుసూధన్‌ను మెట్‌పల్లికి, కార్పొరేటర్ ఆఫీస్ డీఈ జి.ఎల్.మల్లారెడ్డిని అదే ఆఫీస్‌లో ప్రాజెక్టు విభాగానికి, డీఈ మహబూబాద్ బి.పెద్దిరాజంను వరంగల్ డీపీఈ డీఈగా, పెద్దపల్లి ఎస్‌ఈ కార్యాలయంలో డీఈ టెక్నికల్‌ను తొర్రూరు డీఈగా, కార్పొరేట్ ఆఫీస్‌లో ప్రాజెక్టు డీఈ డి.నందరాథోడ్‌ను ప్రాజెక్టు నుంచి ఇంజనీరింగ్ డీఈగా బదిలీ చేశారు. కాపులకనపర్తి ఏడీఈ నరసింహారావును కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు విభాగానికి, ఏడీఈ బి.రవిని ప్రాజెక్టు నుంచి కాపుల కనపర్తికి, ఏడీఈ బి.శ్రీనివాస్ యాదవ్‌ను భూపాలపల్లి క్వాలిటీ కంట్రోల్ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు, ఏడీఈ కె.పవన్ కుమార్‌ను కార్పొరేట్ ఆఫీస్ నుంచి హెచ్‌టీ మీటర్స్ వరంగల్ సర్కిల్‌కు బదిలీ జరిగింది. అకౌంట్స్ జనరల్ మేనేజర్ ఎస్.దేవేందర్‌కు సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా స్థానం చలనం కలిగింది. రెవెన్యూ జీఎం ఆర్.కృష్ణ మోహన్‌ను ఫైనాన్స్ జీఎంగా, ఆడిట్ జీఎం ఎస్.సత్యనారాయణను రెవెన్యూ జీఎంగా, ఫైనాన్స్ జీఎం వి.వేణు బాబును ఆడిట్ జీఎంగా బదిలీ చేశారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



మామునూరు: ఖిలావరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) పథకాల ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధన్నపేట మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన 35 మంది మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ రాజన్న హాజరై మాట్లాడారు. చిన్నపాటి వ్యవసాయ పనిముట్లు మహిళలకు కలిగే శ్రమను తగ్గించి పొలాల్లో కలుపు నివారణ పనులు సులభతరం చేస్తాయని తెలిపారు. కూరగాయల విత్తన కిట్లను ఇంటి ప్రాంగణంలో లేదా కంచెల వెంట నాటడం ద్వారా ఆహార భద్రత మెరుగు పడి గ్రామీణ మహిళల జీవనోపాధి స్థిరత్వానికి తోడ్పడుతుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రైల్వే వంతెన ఘటనతో రైళ్లకు అంతరాయం

- తెలంగాణ రీ షెడ్యూల్, సింగరేణి వరంగల్ వరకే
- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

కాజీపేట రూరల్: పెద్దపల్లి రైల్వే వంతెన (ఆర్వోబీ) ఘటనతో శుక్రవారం పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనతో కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–బల్లార్షా రూట్‌లో ప్రయాణించే పలు రైళ్లకు గంటల తరబడి ఆలస్యం తలెత్తింది. బల్లార్షా–సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్, సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే ఇంటర్‌సిటీ, సికింద్రాబాద్– దానాపూర్ వెళ్లే ధానాపూర్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయం కన్నా గంటల తరబడి ఆలస్యంగా చేరుకున్నాయి. దానాపూర్‌ను ఘన్‌పూర్ స్టేషన్‌లో నిలిపివేయడంతో కాజీపేటకు గంట ఆలస్యంగా చేరుకుంది. అదేవిధంగా న్యూఢిల్లీ–హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు, కాగజ్‌నగర్– సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ 2 గంటలు, కాగజ్‌నగర్– సికింద్రాబాద్ వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ 2:30 గంటలు రీ షెడ్యూల్ చేసినట్లు, భద్రాలచంరోడ్–సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే సింగరేణి ప్యాసింజర్‌ను వరంగల్ వరకే అప్ అండ్ డౌన్ రూట్‌లో నడిపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల ఆలస్యం, రీ షెడ్యూల్‌తో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, కాజీపేట రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయ్‌కుమార్, కాజీపేట రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ ప్రయాణికులకు రైళ్ల రాకపోకలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు.


ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్

ఉప్పల్‌లో ఐదు గంటలు నిలిచిన ఇంటర్‌సిటీ..

కమలాపూర్: హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సుమారు ఐదు గంటల పాటు నిలిచిపోయింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఉప్పల్‌కు సుమారు 8–30 గంటలకు చేరుకుందని తెలిపారు. గంట, రెండు, మూడు, నాలుగు గంటలు గడిచినా రైలు ముందుకు కదలకపోవడంతో రైల్వే అధికారులను అడిగితే పెద్దపల్లి వద్ద ఆర్వోబీ పనులు జరుగుతున్నాయని, ఈ క్రమంలో గడ్డర్లు అమరుస్తున్న క్రమంలో ఓ గడ్డర్‌కు సంబంధించిన వస్తువు కిందకు జారిందని, దీంతో ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎక్కడి రైళ్లను అక్కడే నిలిపి వేశారని చెప్పినట్లు తెలిపారు. చివరికి మధ్యాహ్నం 1–30 ప్రాంతంలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ముందుకు కదిలింది.

పలు రైళ్లు రద్దు, దూరం తగ్గింపు, రీషెడ్యూల్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో ఆపరేషనల్ రీసన్స్‌తో శుక్రవారం పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్, పార్షల్లీ రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

రద్దయిన రైళ్లు

శుక్రవారం బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (67772) పుష్‌పుల్, సిర్పూర్‌టౌన్– కరీంనగర్ (67771) పుష్‌పుల్‌లను రద్దు చేశారు.

దూరం కుదించిన రైళ్లు

భద్రాచలం–బల్లార్షా (17033) సింగరేణి, కాజీపేట–సిర్‌పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, సిర్పూర్‌టౌన్–భద్రాచలం (17034) సింగరేణి, హైదరబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్(17012) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (12757) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూర్ (17202) ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించినట్లు తెలిపారు.

రీ షెడ్యూల్

సికింద్రాబాద్–నాగపూర్ (20102) ఎక్స్‌ప్రెస్‌ను 3 గంటలు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి సర్కారు కృషి

- అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


దివ్యాంగులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి అందజేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించగా, మొదటి విడతలో 54 మందికి వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, సాధారణ ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్‌లు వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అతి త్వరలో నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుపేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి ఒకొక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. అనంతరం మహదేవ్‌పూర్ మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు సుమారు రూ.90 లక్షల విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.20 లక్షలతో నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ చిల్డ్రన్ పార్క్‌ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపీఓ రాధిక, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు రామచందర్‌రావు, నాగార్జునరావు, ఎస్సైలు పవన్, తమాషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ దత్తత గ్రామంలో సంబురాలు

- కొండపర్తిలో గవర్నర్, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తిలో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. కొండపర్తిలో ఇప్పటికే చాలా మేరకు అభివృద్ధి పనులు చేశారు. గ్రామంలోని ఆదివాసీలను వ్యవసాయం రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులతోపాటు 45 ఇళ్లు మంజూరు చేశారు. 7 వ్యవసాయ బోరుబావుల నిర్మాణంతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, మిర్చి పౌడర్ తయారీ పనులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చుపటేల్ మాట్లాడుతూ మంత్రి సీతక్క సూచన మేరకు గవర్నర్.. కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కొండపర్తి అభివృద్ధికి కృషి చేస్తున్న గవర్నర్, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇర్ప సీతారాములు, కల్తి రమేశ్, ఇర్ప రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు


సీఎండీ వరుణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన డైరెక్టర్లు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం టీజీ ఎన్పీడీసీఎల్ డైరక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఫైనాన్స్ డైరెక్టర్‌గా వంటెరు తిరుపతి రెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.మదుసూధన్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా వంగూరు మోహన్ రావు, హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్ డైరెక్టర్‌గా సి.ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించగా.. సీఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి కృషితో కంపెనీని అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. సీఎండీ వరుణ్ రెడ్డి సారథ్యంలో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములవుతామని, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్లను అసోషియేషన్లు, యూనియన్ల నాయకులు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హక్కుల పరిరక్షణలో ఓంకార్ పాత్ర ఎనలేనిది

- మోదీ పాలన దేశానికే ప్రమాదకరం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా: పౌర హక్కులు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే ఓంకార్ చేసిన ఉద్యమాలు, త్యాగాలు ఎనలేనివని పలువురు వక్తలు తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల్లో భాగంగా పౌర హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెదారపు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, న్యూ డెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, నాయకులు నున్నా అప్పరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు సోమ రామమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా జైలులో పెడుతుందని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నాని అన్నారు. అడవిలోని ఆదివాసీలను కాల్చి చంపుతూ.. అటవీ సంపద కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్, కుసుంబ బాబురావు, జగదీశ్వర్, నలిగంటి చంద్రమౌళి, రాజన్న, అనిత, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లోనే పీవీ..

కళ తప్పిన వంగర గ్రామం
- నేడు పీవీ నర్సింహారావు జయంతి
- వంగరలో తుదిదశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు



ఎల్కతుర్తి: అభివృద్ధి లేమి.. అప్పుల ఊబిలో కూనరిల్లుతున్న తరుణంలో అన్నీ తానై ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిబాట పట్టించారు.. నాటి ప్రధాని పీవీ నర్సింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలంలోని వంగర అనే ఒక చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగర గ్రామం ఓ వెలుగు వెలిగింది. ఆ సమయంలోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నేడు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతి.

భీమదేవరపల్లి మండలం వంగరలో 1921 జూన్ 28న పీవీ జన్మించారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా పదవులకు వన్నెతెచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగరలో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ మంజూరైంది. రక్షిత తాగునీటి బావి, పీవీ మోడల్ కాలనీ, బాలికల గురుకుల పాఠశాల, 24 గంటలు పనిచేసే ఆస్పత్రి, సబ్‌స్టేషన్ మంజూరయ్యాయి. ఓ వైపు దేశం, మరో వైపు కాంగ్రెస్ పార్టీ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో పీవీ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని తలెత్తుకునేలా చేయడంతోపాటు భారత ఖ్యాతిని దేశ విదేశాల్లో ఇనుమడింపజేసిన ఘనత పీవీదే. కాగా, 2004 డిసెంబర్ 23న పీవీ తుదిశ్వాస విడిచారు. పీవీ మరణానంతరం అయనను సొంతపార్టీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. పీవీ నర్సింహారావు ఇంటిని మ్యూజియంగా మారుస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. పీవీ సొంతగ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో చివరకు గ్రామస్తులే చందాలు వసూలు చేసుకొని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గమనార్హం.


నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం

నెరవేరని హామీలు..

హనుమకొండ- సిద్ధిపేట రహదారిలో వంగర క్రాస్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో స్వాగత తోరణం, పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు లైన్ల రహదారి నిర్మించి, సెంట్రల్ లైటింగ్ తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ, నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి వంగరలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుది దశలో పీవీ విజ్ఞాన కేంద్రం పనులు

వంగర గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్ రూ.11 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. పీవీ విజ్ఞాన వేదిక పార్కు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. పీవీ విజ్ఞాన వేదికలో ప్రవేశ ద్వారం, ఫుడ్‌కోర్టు, ఫొటో గ్యాలరీ, పీవీ జీవిత విశేషాలకు సంబంధించిన చిత్రాలు ఉండేలా రూపకల్పన చేశారు. దీంతోపాటు ధ్యాన మందిరం, సైన్స్ మ్యూజియం, అంపీ థియేటర్, వాటర్ ఫౌంటేషన్, చారిత్రక శిల్పాలు, పార్క్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. పీవీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, అప్పటి నాయకులు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి పొన్నం ప్రభాకర్.. పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణం పనులను వేగవంతం చేశారు. దీంతో నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

స్నాతకోత్సవానికి సమన్వయంతో పనిచేయాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: జూలై 7న నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి ఆయా కమిటీల కన్వీనర్లు, మెంబర్లను కోరారు. ఇప్పటికే స్నాతకోత్సవం నిర్వహణకు ఐదుగురు ప్రొఫెసర్లతో కూడిన స్టీరింగ్ కమిటీ, 10 సబ్ కమిటీలను కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం నియమించారు. అన్ని కమిటీల కన్వీనర్లతో శుక్రవారం క్యాంపస్‌లోని అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం స్టీరింగ్ కమిటీ మెంబర్ కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ.. ఇప్పటికే 331 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 374 మంది విద్యార్థులకు 564 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన విషయాలను ఆయన వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఆచార్య మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రొఫెసర్ మనోహర్, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, అమరవేణి, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, ప్రొఫెసర్ షమిత, ప్రొఫెసర్‌వై వెంకయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కమిటీల బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలి

- డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్

హన్మకొండ: పర్యాటకులు ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్ అన్నారు. ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో బొగత జలపాతానికి బయల్దేరిన రెండు ఆర్టీసీ బస్సులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాగార్జునసాగర్, బొగత జలపాతం, శ్రీశైలం, పాండవుల గుట్టలు, కాళేశ్వరం దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, వేములవాడ, కొండగట్టు, కానిపాకం, అరుణాచలం, జోగులాంబ ప్రదేశాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్స్ ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఈ టూర్‌కు సమకూరుస్తున్నామన్నారు. 30 మంది ఉంటే బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89777 81103, 94938 82464, 95730 90136 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్, ఉద్యోగులు, పర్యాటకులు పాల్గొన్నారు.